క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడలకు జి.కొండూరు విద్యార్థులు



జి.కొండూరు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జి.కొండూరు శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు కృష్ణాజిల్లా జట్టు తరఫున అండర్–14 బాలికల విభాగంలో ఎస్.వెంకటజాహ్నవి, కె.అక్షిత, చంద్రిక, బాలుర విభాగంలో రేవంత్, మణికంఠ, అండర్–17 బాలికల విభాగంలో సలోమి, ప్రియాంక, యామిని, నందిని, కుప్పశ్రీ, బాలుర విభాగంలో బషీర్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ సీజర్‌రెడ్డి, పీఈటీ మాధవరావును పలువురు అభినందించారు.

ప్రముఖ కవి చిలకమర్తికి నివాళి



పెనుగొలను(గంపలగూడెం): ప్రముఖ కవి, సంఘసంస్కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహ జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఈఓ వీ శేషిరెడ్డి మాట్లాడుతూ చిలకమర్తి నవల, నాటక రచయితగా, సంపాదకునిగా, ఉపాధ్యాయుడిగా ప్రజలను చైతన్య పరిచారని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా కళాప్రపూర్ణ, లోకల్ షేక్స్పియర్ బిరుదులు పొందారన్నారు. సేవా కమిటీ సభ్యులు ఎం చెంచు రెడ్డి, ఇలాసాగరపు రామారావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఎల్బీఆర్‌సీఈ విద్యార్థుల ప్రతిభ



మైలవరం: వెయిట్ లిఫ్టింగ్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉమ్మడి కృష్ణా జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తమ ప్రతిభ కనబర్చి ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలను కైవశం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మంగళవారం తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఎన్టీఆర్ మెమోరియల్ కృష్ణ జిల్లా ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్(మెన్ అండ్ ఉమెన్) సోమవారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీలలో ఏ తేజశ్వని 81 కేటగిరిలో సిల్వర మెడల్, డీ జాహ్నవి 81 కేటగిరిలో బ్రాంజ్ మెడల్, కే పల్లవి 49 కేటగిరీలో బ్రాంజ్, బి. హర్షిణి 59 కిలోల కేటగిరిలో బ్రాంజ్, కే అనూష 71కేటగిరిలో బ్రాంజ్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అసిస్టెంట్ పీడీ బేబీరాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వాసవి ఫార్మా కాంప్లెక్స్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో బుధవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు దత్త కల్యాణ మండపం ఏరియా, వాసవి ఫార్మా మెడికల్ కాంప్లెక్స్, నార్త్ ఫేస్ అపార్ట్‌మెంట్ ఏరియా, మురళి ఐస్ ప్లాంట్ ఏరియా, గంగా గోదావరి అపార్ట్‌మెంట్ ఏరియా, అభినందన అపార్ట్‌మెంట్ ఏరియా వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

గేదెలను ఇష్టపూర్వకంగా కొనుగోలు చేయవచ్చు

గంపలగూడెం: జగనన్న పాలవెల్లువలో భాగంగా రైతులు తీసుకొన్న బ్యాంక్‌రుణంతో వారి ఇష్టానుసారంగా గెదెలను కొనుగోలు చేయవచ్చని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం మండల సమాఖ్య కేంద్రంలో మంగళవారం గేదెల కొనుగోలుకు అందజేసే బ్యాంక్ రుణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ ద్వారా రైతులకు అవసరమైన రుణం అందజేస్తామన్నారు. మొత్తం రుణం రూ.1.03లక్షలు కాగా అందులో రైతు తన వాటాగా రూ.10,300 చెల్లించాల్సి ఉందన్నారు. గేదెల పోషణకు మరో రూ.30వేల రుణం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ తెనాలి నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు, పశువైద్యులు సాయి కృష్ణ, ఏపీఎం రాంబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ పాల్గొన్నారు.

గణనాథుడికి కావిడి సేవ

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలంలోని పలుగ్రామాల్లో వినాయక చవితి పర్వదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నవరాత్రి ప్రత్యేక శిబిరాల్లో తొమ్మిదో రోజు మంగళవారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. పెనుగొలను రంగనాయకస్వామి ఆలయం వెనుక ఏర్పాటు చేసిన నవరాత్రి శిబిరంలో గణపతికి కావిడిసేవ సాంప్రదాయబద్ధంగా జరిపారు. కావిడిలో అన్నం, కూరలు తీసుకొచ్చి స్వామికి నివేదన గావించారు. ఊటుకూరు గాంధీసెంటర్‌లో నెలకొల్పిన విగ్రహం వద్ద పంచామృతాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. రాత్రికి సిద్ధి, బుద్ధి సమేత వినాయక కల్యాణం రమణీయంగా నిర్వహించారు. గంపలగూడెం కాపుల బజారులో విగ్రహం వద్ద హనుమాన్‌చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



పెనుగొలనులో గణపతికి కావిడి సేవ

రూ.లక్ష పలికిన గణనాథుని లడ్డూ

ముసునూరు: మండల వ్యాప్తంగా వినాయక ఉత్సవాల సందర్భంగా ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణనాథులకు మంగళవారం ప్రత్యేక పూజలు, లడ్డూ వేలం పాటలు, అన్న సంతర్పణలు, ఊరేగింపులు, నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. చింతలవల్లి శివారు గోగులంపాడులో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఐదు కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన చలసాని ఉదయభాస్కర్ రూ.1,03,300కు పాడుకున్నారు. మూడు కిలోల లడ్డూను కాటేపల్లి ఉదయ చందు రూ.27,100కు దక్కించుకున్నారు. అనంతరం గణనాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బాణసంచా, మేళతాళాలతో ఊరేగించి స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

గంపలగూడెంలో లడ్డూ రూ. 21,500

గంపలగూడెం: స్థానిక గాంధీ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి శిబిరంలో మహా ప్రసాదం లడ్డూకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మాజీ మండల అధ్యక్షుడు కాజా రవికుమార్, సుజాత దంపతులు రూ. 21,500కు లడ్డూను కైవసం చేసుకున్నారు. కాగా ప్రతి ఏటా నిర్వహించే వినాయక కల్యాణానికి వినియోగించేందుకు అవసరమైన రూ. 6,500 విలువైన రెండు వెండి కొబ్బరి చిప్పలను స్థానిక ఆర్యవైశ్యులు కుందా అనిల్, సరిత కమిటీ సభ్యులకు అందజేశారు.



ఊటుకూరులో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



ముసునూరు మండలం గోగులంపాడులో లడ్డూను రూ.లక్షకు దక్కించుకున్న ఉదయభాస్కర్



గంపలగూడెం గాంధీసెంటర్లో వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న రవికుమార్ దంపతులు

ఘనంగా వినాయక నిమజ్జనం



ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులో వినాయకుడిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

నూజివీడు(ఆగిరిపల్లి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులో వినాయక విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. తొలుత లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన రౌతు రామారావు రూ.18 వేలకు పాడారు. అనంతరం గ్రామంలోని నల్లచెరువులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

అన్నదానం

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ గ్రామంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కర్‌రెడ్డి, పాలంకి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ కోమటి కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొలుసు గంగాధర్, గ్రామ సచివాలయాల కన్వీనర్ దాసరి గురవయ్య పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి

అనుముల్లంకలో అన్నదానం

అనుముల్లంక(గంపలగూడెం): వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా గంపలగూడెం మండలం అనుముల్లంకలో మంగళవారం రాత్రి అన్నదానం చేశారు. స్థానిక మూడు బజార్ల సెంటర్లో ఏర్పాటు చేసిన నవరాత్రి శిబిరం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లిరోడ్డులో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి పందిళ్ల వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తిరువూరు: శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం తిరువూరు మండలంలోని పలు విద్యాసంస్థల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్లకు ×ఆచార్య దేవోభవ₹ అనే అంశంపైన, సీనియర్లకు ×మానవతను పెంపొందించు విద్య ఆవశ్యకత₹ అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. తిరువూరు సిద్ధార్థ, శ్రీనిధి పాఠశాలల్లో, వాహినీ కళాశాలలో, చిట్టేల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు తెలిపారు.

అక్టోబర్ 1నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



తిరువూరు: ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఏర్పడి 50 సంవత్సరాలైన సందర్భంగా అక్టోబర్ 1 నుంచి స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం స్వర్ణోత్సవ కార్యక్రమ పోస్టర్ల ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు అపర్ణ, శీనయ్య, ముత్తయ్య, భరతకుమారి, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ శ్యాం సుందర్ యూటీఎఫ్ స్వర్ణోత్సవ వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి త్రినాథ్, మండల శాఖ ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

మైలవరం: నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీర వనిత చాకలి చిట్యాల ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్దారపు వెంకట్రావు తెలిపారు. రజక సంఘం కార్యాలయ ఆవరణలో ఐలమ్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక జనసేవ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లెల రాధాకృష్ణ, మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు తాళ్లూరి శేషగిరిరావు, మల్లెల దుర్గారావు, నాయకులు డి.వీరభద్రరావు, తెనాలి అర్జున్‌రావు, కె.ఫణీంద్ర పాల్గొన్నారు.



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

సంక్షిప్త వార్తలు

■ **ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం**



ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, ప్రజాప్రతినిధులు

ముసునూరు: మండలంలోని కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం అభినందనీయమని ఎంఈఓ బీవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం ముసునూరులో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విజయలక్ష్మి దంపతులను అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

■ **విద్యార్థికి ప్రాథమిక విద్య కీలకం**

రెడ్డిగూడెం: ప్రతి విద్యార్థికీ థమిక విద్యే కీలకమని ఎంఈఓ రమేష్ అన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న సిలబస్‌ను అందుకోవాలంటే అధ్యాపకులు శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ జి.ధర్మశీల, రిసోర్స్ పర్సన్స్ పి.రవికుమార్, అబీబుల్లా, ఉపాధ్యాయులు సీఆర్‌పీ రమేష్, గంగరాజులు పాల్గొన్నారు.

■ **వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు**

గంపలగూడెం: గంపలగూడెం మండలం మేడూరులో శ్రీ వీరాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం తమలపాకులతో అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

■ **ముసునూరు విద్యార్థుల విజయభేరి**



విజేతలుగా నిలిచిన దివ్యాంగులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ముసునూరు: జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో మండల విద్యార్థులు విజేతలుగా నిలిచి విజయభేరి మోగించినట్లు ఐఈఆర్ టీచర్ లక్ష్మీనారాయణరావు తెలిపారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన పోటీల్లో ముసునూరు మండలానికి చెందిన జె.మధులత బేస్‌బాల్, షాట్‌పుట్, 75 మీటర్ల పరుగు పందెం మూడింటిలోనూ ప్రథమ స్థానంతో నిలిచింది. మరో విద్యార్థి రాఘవ బేస్‌బాల్ పోటీలో ప్రథమ, 75 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచాడు. మరో బాలిక ఇవాంజిలిన్ 50 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రం వద్ద విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 26వ తేదీ వరకు జరిగిన ఉచిత యోగా శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. యోగా గురువు లంకే జనార్దన్ రెండువారాల పాటు యోగా సాధకులకు యోగాసనాలు, ప్రాణాయామం, ముద్రలు, సూర్యనమస్కారాలు నేర్పించారు. యోగా గురువు జనార్దన్‌ను సత్కరించారు. ఎన్టీటీపీఎస్ ఎస్ఈ సురేంద్రబాబు పాల్గొన్నారు.

భారీ వర్షం

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం నమోదైంది. ఈ వర్షం రాకతో రైతుల్లో ఆనందోత్సహాలు నెలకొన్నాయి. సాగు చేసిన వివిధరకాల పైర్లకు ఈ వర్షం ఎంతో లాభం చేకూరుస్తుందని రైతులు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలతో ఇబ్బంది పడుతున్న తరుణంలో వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊరడిల్లారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



జి.కొండూరు: జి.కొండూరు గుడిసెంటర్లో గుర్తు తెలియని వృద్ధురాలు(60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై ధర్మరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలు గత సంవత్సర కాలంగా గ్రామంలో బిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు తమను 08662802233, 94407 96448లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యం

గంపలగూడెం: గర్భిణులు, బాలింతలు తగిన పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటమే కాక వారికి పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం–182వ అంగన్‌వాడీ కేంద్రం, ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యకర్తలు మాట్లాడుతూ పోషకాలు ఉండే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఊటుకూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటకుమారి, కార్యకర్తలు నాగేశ్వరమ్మ, స్రవంతి, నాగమణి, బుజ్జి,నజీమా, హెచ్‌ఎం మంజుల పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’సద్వినియోగం చేసుకోండి



రోలుపడిలో ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం

రోలుపడి(తిరువూరు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముష్టికుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ చైర్‌పర్సన్ బండి రవికుమార్ కోరారు. మండలంలోని రోలుపడి సచివాలయంలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామ వలంటీర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులను రోలుపడి శివారు రాజీవ్‌నగర్, సూరవరం గ్రామాల్లో పంపిణీ చేసినందున ప్రభుత్వం ఉచితంగా అందించే రక్తపరీక్షలు, మధుమేహ పరీక్షలను సత్వరం పొందవచ్చని పేర్కొన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ చలపతిరావు, హెల్త్ విజిటర్ పద్మావతి పాల్గొన్నారు.

జెమినీ వైరస్ తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

తిరువూరు ఉద్యానవనశాఖ అధికారి సోహైల్ అహ్మద్



కొణిజెర్లలో మిరప చేలో రైతులకు సూచనలిస్తున్న హెచ్‌ఓ సోహైల్ అహ్మద్

కొణిజెర్ల(గంపలగూడెం): మిరప పైరులో జెమినీ వైరస్(బొబ్బర) ఆశించిందని, తక్షణమే రైతాంగం నివారణ చర్యలు తీసుకోవాలని తిరువూరు ఉద్యానవనశాఖ అధికారి సోహైల్ అహ్మద్ తెలిపారు. గంపలగూడెం మండలం కొణిజెర్లలో రైతులతో కలిసి ఆయన మిరపచేలను మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణం కారణంగా రసం పీల్చే పురుగు ఉధృతి పెరిగి వైరస్ వ్యాప్తికి అవకాశం ఏర్పడుతుందన్నారు. చేలో ముందుగా జెమినీ వైరస్ సోకిన మొక్కలను గుర్తించి పీకివేయాలన్నారు. మోతాదుకు మించి కాంప్లెక్స్ ఎరువులు వాడకం వల్ల భూమిలో భాస్వరం ఎక్కువై సూక్ష్మపోషకాలు మొక్కకు అందకపోవడంతో బలహీనపడి వైరస్ తెగులు ఆశిస్తుందనే విషయం రైతులు గ్రహించాలన్నారు. వైరస్ వ్యాప్తికి కారకాలైన తెల్లదోమ, తామరపురుగు యొక్క ఉధృతిని ప్రధానంగా రైతులు గమనించాలన్నారు. దీని కోసం పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 30 వరకు ఏర్పాటు చేయాలన్నారు. తెల్లదోమ ఉధృతిని అరికట్టేందుకు పైరిప్రాక్సిఫెన్(లానో) 10శాతం ఇసీని ఎకరానికి 200 ఎంఎల్ చొప్పున వేపనూనెలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న అమెరికా దేశస్తులు నాథన్, లిండ్సే దంపతులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చేతివృత్తులు దోహదపడతాయని గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మోగులూరి ఎలీషా అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధికి చేతి వృత్తుల్లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో రెండో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. అమెరికా దేశస్తులు నాథన్, లిండ్సే దంపతులు మాట్లాడుతూ మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కొంత ఆర్థిక సాయంతో కుట్టు మిషన్లు అందిస్తామని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు జెడ్పీ బాలికలు



బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అండర్ 16 బాలబాలికల జట్టు ఎంపికలు మంగళవారం జరిగాయి. వివిధ మండలాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీలో కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన ఐదుగురు బాలికలు మేరీరత్నకుమారి, తేజశ్రీ, పుష్పలత, గీతిక, నవ్యశ్రీ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పద్మలత తెలిపారు.

ఎంపికైన బాలికలను అభినందించారు. పీడీలు రత్నం, రిజ్వాన, శశిరేఖ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

29న మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: ఈనెల 29వ తేదీన మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దుర్గాప్రసాదు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని కోరారు.

రేపు మెగా వైద్యశిబిరం

చాట్రాయి: విస్సన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ఆరుగొలనుపేటలో ఈనెల 28వ తేదీన మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణ తెలిపారు. ఆంధ్రా ఆస్పత్రి, అమరావతి కంటి ఆస్పత్రి, దుహిత దంత వైద్యశాల, మణిపాల్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరంలో 2డి ఎకో కిడ్నీ స్కానింగ్, బోన్ స్కానింగ్, క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

డాక్యుమెంట్ పోయినది

పిన్నిబోయిన వెంకటేశ్వరమ్మ అనే పండి వెంకటేశ్వరమ్మ W/o. వేయిగళ్ళు, డి.నెం. 6-38/2 మీర్జాపురం పంచాయితీ పరిధిలోని కంద్రిక గొల్లగూడెం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా వారికి చెందిన వ్యవసాయ భూమి ఆర్.యస్.నెం. 12-4లోని య. 0.41 సెంట్లు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్ జిరాక్స్ కాపీలు తీయించడానికి నూజివీడు బైక్‌పై వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది దొరికిన వారు పై అడ్రస్సును సంప్రదించగలరు.

డాక్యుమెంట్ పోయినది

పిన్నిబోయిన వేయిగళ్ళు S/o. వసంతరావు, డి.నెం. 6-38/2 మీర్జాపురం పంచాయితీ పరిధిలోని కంద్రిక గొల్లగూడెం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా వారికి చెందిన వ్యవసాయ భూమి ఆర్.యస్.నెం. 12-4లోని య. 0.41 సెంట్లు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్ జిరాక్స్ కాపీలు తీయించడానికి నూజివీడు బైక్‌పై వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది దొరికిన వారు పై అడ్రస్సును సంప్రదించగలరు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్

ఆగిరిపల్లి బ్రాంచి. ఫోన్: 08656-224933, 8886644247

బంగారు నగల వేలం ప్రకటన

ఈ బ్రాంచి నందు క్రింద తెలుపబడిన ఖాతాదారుడు బంగారు నగలు తాకట్టుపెట్టి రుణం పొంది సదరు రుణము, వడ్డీ చెల్లించుటకు నోటీసులు ఇచ్చినప్పటికీ చెల్లించనందున వీరు చూపు తాకట్టుపెట్టిన బంగారునగలు ది. 07-10-2023 అనగా శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు బహిరంగ వేలం వేయుటకు నిర్ణయించడమైనది. నోటీసులు అందని వారుకూడా ఇది చివరి నోటీసుగా భావించగలరు. వేలములో పాల్గొనదలచినవారు రూ. 10,000/- ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలెను. ఇతర వివరాలకు మేనేజరుగారిని సంప్రదించగలరు. ఏ కారణం చేతనైనా వేలం నిలిపి వేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని మేనేజరు గారికి పూర్తి అధికారం కలదు. వేలం తరువాత బాకీ ఇంకనూ తీరని యెడల వారిపై కోర్టు ద్వారా తగిన చర్యలు తీసుకొనబడును.

క్ర. సెం.	ఖాతాదారుని నెంబరు	ఖాతాదారుని పేరు	తండ్రి/భర్త పేరు	గ్రామము	బంగారం గ్రాములలో
1	50043894686	పామర్తి కిషోర్	కోటేశ్వరరావు	ఆగిరిపల్లి	23.7
2	50043895341	పామర్తి కిషోర్	కోటేశ్వరరావు	ఆగిరిపల్లి	63.8
3	50045070473	పామర్తి కిషోర్	కోటేశ్వరరావు	ఆగిరిపల్లి	19.9

తేది: 26-09-2023 సం/- బ్రాంచి మేనేజరు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్

99510 20399 (తిరువూరు,

99122 20544 (నూజివీడు)

90102 23734 (మైలవరం)

Office mail : sakshiads@gmail.com